చాపరాయిలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యటకులు సందర్శించారు. దీంతో జలపాతం పర్యాటకుల తాకిడితో కిటకిటలాడింది. అరుకు ఉత్సవాలు జరుగుతుండడంతో కూడా పర్యాటకులు ఉత్సవాలను చూడడానికి చివరిరోజు మైధాన ప్రాంతం నుంచి తరలి వచ్చారు. సందర్శిం చిన పర్యాటకులు జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు.



చాపరాయిలో పర్యాటకులు

కేంద్ర బడ్జెట్‌లో అన్యాయంపై సిపిఎం నిరసనలు

బడ్జెట్ పత్రాల దహనం



ఎటపాక మండలం గుండాల కాలనీలో బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఎటపాక

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి మొండి చేయి చూపడంపై సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని గుండాల కాలనీలో బడ్జెట్ కాపీ పత్రాలను దహనం చేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు పులుసు బాలకృష్ణ మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలను కేంద్రం పక్కన పెట్టిందని, విభజన చట్ట ప్రకారం వచ్చిన ఏ సంస్థకూ నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటి, ఐఐటి, ఐఐఎం, ఐఐఐటీ, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, దుగ్గరాజపట్నం పోర్ట్, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, ఎయిమ్స్, రాజధాని నిర్మాణానికి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. ఉపాధి హామీ నిధులు, ఎరువులపై సబ్సిడీ తగ్గించిందన్నారు. మరో వైపు బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐలు అనుమతి ఇవ్వడం దేశానికి ప్రమాదకరమని తెలిపారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రజలు నిరసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఐ.పద్మ, జి.హరి, నాయకులు తోట శ్రీను, నూతలపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : కేంద్ర ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ మండలంలోని రేఖపల్లి జంక్షన్ వద్ద సిపిఎం నాయకులు ఆదివారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నాయకులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ బడ్జెట్లో ఏపికి కేంద్రం మళ్లీ మొండి చేయి చూపించిందన్నారు. పోలవరం పునరావసం, పరిహారం, ప్యాకేజీ ఊసే లేదన్నారు. దళిత, గిరిజనులకు సబ్‌ప్లాన్ కేటాయింపులు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రానికి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు తొత్తులుగా మారాయని, ప్రజలపై అనేక భారాలు మోపినా ఆ పార్టీల నాయకులు మాట్లాడటం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు పంకు సత్తిబాబు, మండల కమిటీ సభ్యులు తోడం రాజు, తాతబాబు రెడ్డి, గుండిపూడి లక్ష్మణరావు, కమ్మచిచ్చు సత్యనారాయణ, రేకపల్లి పీసా ఉపాధ్యక్షులు సార పాండురాజు సోడి మల్లయ్య, హజరత్, వీర్ల నాగేశ్వరరావు. తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి తీవ్ర అన్యాయం చేసిందని సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు పొడియం లక్ష్మణ్ ఆరోపించారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వ సితులకు కూడా ఈ బడ్జెట్లో ఒక రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, కూర ముకయ్య తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలను అడియాసలు చేసిందని సిపిఎం జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, యామల అప్పలనాయుడు విమర్శించారు. ఆదివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బిజెపి మరోసారి రాష్ట్రానికి ద్రోహం చేసిందన్నారు. వ్యవసాయానికి సబ్సిడీలు తగ్గించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సాన బొంజన్న తదితరులు పాల్గొన్నారు.



విఆర్.పురం మండలం రేఖపల్లిలో నిరసన తెలుపుతున్న సిపిఎం శ్రేణులు

పబ్లిక్ గ్రీవెన్స్ తాత్కాలికంగా రద్దు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఐటీడీఏలోనూ, అన్ని మండలాల్లోనూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయం గమనించి ఎన్నికల కోడ్ ముగిసి, తాము మళ్లీ ప్రకటించే వరకు ప్రజలెవరు పబ్లిక్ గ్రీవెన్స్ రావొద్దని కోరారు.

అధిక ధరలకు పాపికొండల బోటు టికెట్లు

★ రూ.950 ఉంటే రూ.2000 వరకు వసూలు

★ పట్టించుకోని బోట్లు యజమానుల సంఘం

★ చోద్యం చూస్తున్న పర్యాటకశాఖ అధికారులు

ప్రజాశక్తి-విఆర్.పురం

పాపికొండల విహార యాత్రలో పర్యాటకులు నిలువ దోపిడీకి గురవుతున్నారు. విఆర్.పురం మండలం పోచారం నుండి రూ.950 టికెట్ ధర ఉంటే, టికెట్లు బుక్ చేసే మధ్య దళారీలు రూ.2వేలు వరకూ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు గంటన్నర, రెండు గంటల్లోనే విహార యాత్ర ముగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాపికొండలకు వెళ్లే బోట్లు విఆర్.పురం మండలం పోచారం నుండి బయలుదేరుతాయి. కొల్లూరు వద్ద పాపికొండలుకు వెళ్లిన తరువాత తిరిగి పేరంటపల్లి మీదుగా పోచారం తీసుకొస్తారు. ఈ బోటు ప్రయాణానికి విఆర్.పురంలోనూ, అటు తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోనూ టికెట్ల విక్రయం జరుగుతుంది. బోట్లు యజమానులు ఎపి టూరిజం శాఖ నిర్ణయించిన ధరలకే పర్యాటకులను తీసుకెళ్లాల్సి ఉంది. పోచారం నుండి ఒక్కో మనిషికి రూ.950గా టికెట్ ధర నిర్ణయించారు. అయితే తెలంగాణ ప్రాంతం నుండి వచ్చే పర్యాటకులు భద్రాచలంలో టికెట్లు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మధ్య దళారులు ఒక్కో టికెట్‌కు రూ.2వేలు వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటిడిఎ అధికారి దృష్టికి రాగా ఆయన ఇటీవల రంగంలోకి దిగడంతో ఈ తతంగం వెలుగు చూసింది. ఎంతో కాలంగా పాపికొండలు విహార యాత్రలో పర్యాటకులను మధ్య దళారీలు నిలువదోపిడీ చేస్తున్నా ఇటు టూరిజం శాఖ అధికారులుగాని, అటు బోటు యజమానులు, వారి యూనియన్ నాయకులుగాని పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.



విఆర్.పురం మండలం పోచారం వద్ద ఉన్న పాపికొండలు వెళ్లే బోట్లు

మరో వైపు అంత మొత్తంలో టికెట్ కొనుగోలు చేసి పాపికొండలు బోటు ఎక్కితే గంటన్నర, రెండు గంటల్లోనే తీసుకెళ్లి తీసుకొచ్చేస్తున్నారని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు టూరిస్టులు బోట్ పాయింట్ దగ్గరికి వస్తే, సుమారు 2 గంటల పాటు నిరీక్షించాల్సి వస్తోంది. ఉదయం 11, 11.30 గంటలకు పోచారం నుండి బోట్లు బయలుదేరుతున్నాయి. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట, 1.30 గంటల కల్లా తీసుకొస్తున్నారని పర్యాటకులు చెబుతున్నారు. కనీసం మూడు నుండి నాలుగు గంటలైనా నదిలో విహరించే పరిస్థితి లేదని వాపోతున్నారు. ప్రభుత్వం టూరిజం అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని చెబుతుంటే, ఇక్కడ టికెట్లలొల్లి జరుగుతోంది. టికెట్లు లేవని బ్లాక్‌లో రూ.2 వేలు వరకు కొనుగోలు చేయడం, అంతమొత్తం ఖర్చు చేసినా సంతృప్తికరంగా విహారం సాగడం లేదని పర్యాటకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి టికెట్లకు అధిక మొత్తంలో వసూలు చేయడంపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకొని అవినీతి అక్రమాలకు చెక్ పెట్టాలని, పర్యాటకులు సంతృప్తికరంగా విహారం సాగించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బ్లడ్ కేన్సర్‌తో బాలుడు మృతి

- ఆర్థిక స్థోమత లేక వైద్యం చేయించుకోలేని దుస్థితి

- బతకాలని ఉంది.. బతికించాలని చివరి వరకు వేడుకోలు

ప్రజాశక్తి-కొయ్యూరు

14 ఏళ్ల పసి ప్రాయంలోనే బ్లడ్ కేన్సర్ రూపంలో మృతువు బలితీసుకుంది. చిన్న వయస్సులోనే తల్లిదండ్రులు దూరమవ్వగా, మేనత్తే సాకింది. ఆర్థిక స్థోమత లేక సరైన వైద్యం చేయించుకోలేని దుస్థితి. విషయం బాహ్య ప్రపంచానికి తలిసే లోపే వ్యాధి తీవ్రమైంది. 'నాకు బతకాలని ఉంది.. నన్ను బతికించండి' అని వేడుకున్న కొద్ది సమయానికే ఆ బాలుడు మృతి చెందడం పలువురిని కలచివేసింది.

కొయ్యూరు మండలం, రాజేంద్ర పాలెం గ్రామానికి చెందిన గోకిరి శ్యాంప్రకాష్ వయస్సు 14 సంవత్సరాలు. చిన్న వయస్సులోనే తల్లిదండ్రులు దూరమయ్యారు. కడు పేదరికంలో ఉన్న మేనత్త చిన్నాచితకా పనులు చేసుకుంటూ ఆ బాలుడిని పోషించింది. దురదృష్టవశాత్తు మూడేళ్ల క్రితం ఆ బాలుడు అతి ప్రాణాంతకమైన బ్లడ్ కేన్సర్ వ్యాధికి గురయ్యాడు. విశాఖపట్నం ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆపరేషన్ చేయాలని, రూ.18 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఆపరేషన్ మాట ఎలా ఉన్నా... డబ్బుల్లేక ఏడాది నుండి కిమియోథెరిఫీ కూడా చేయించుకోలేని దుస్థితి. మూడు రోజుల క్రితం విషయం తెలుసుకొని జనసేన నాయకులు కొత్త మొత్తం ఆర్థిక సాయం చేయగా, కొయ్యూరు ఎ వి డ బ్ల్యు జె ఎ ఫ్ పాత్రికేయులు ఆదివారం బాలుడిని పరామర్శించి కొంత మొత్తం ఆర్థిక సహాయం అందించారు. ఈ సమయంలో ఆ బాలుడు 'నాకు విరాళాలు వద్దు... నాకు బతకాలని ఉంది.. నన్ను బతికించండి.. అంటూ పాత్రికేయ మిత్రులను వేడుకున్నాడు. ఈ బాలుడి పరిస్థితిని చూసి చలించిపోయిన పాత్రికేయులు మేమున్నామంటూ ధైర్యం చెప్పి, అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఇంతలోనే ఆ బాలుడు ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఆర్థిక స్థోమత లేక, వైద్యం చేయించుకోలేకే శ్యామ్ ప్రకాష్ మృతి చెందాడు.



చనిపోవడానికి ముందు ఆర్థిక సాయం అందిస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధులు



కళాకారుల అద్భుత విన్యాసం



క్యాట్ వాక్ చేస్తున్న మహిళలు

ఉత్సాహంగా ముగిసిన అరకు చలి ఉత్సవ్

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయలో మూడు రోజులపాటు నిర్వహించిన అరుకు చలి ఉత్సవ్ ఉత్సాహంగా ఆదివారం ముగిసింది. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ నేతృత్వంలో పాడేరు ఐటిడిఏ పిఓ అభిషేక్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమని పటేల్ ఉత్సవ్ విజయవంతనికి కృషి చేశారు. ఉత్సవ్ సందర్భంగా నిర్వహించిన వివిధ రాష్ట్రాల కళాకారుల కార్యక్రమాలు అలరింపజేశాయి. జానపద గీతాలు, సినీ గీతాలు వందేమాతరం శ్రీనివాస్ ఆలపించి అందర్నీ ఆకర్షించారు. నిత్యం బిజీగా ఉండే ఐఏఎస్ అధికారులు అరకు ఉత్సవంలో స్టెప్పులు వేయడంతో పర్యాటకులు స్థానికులు గిరిజనులు ఆశక్తిగా తిలకించారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో అరకు చలి ఉత్సవ్ నిర్వహించడంతో ఉత్సవం తిలకించడానికి వెళ్లేవారు కొంత ఇబ్బందులు పడ్డారు. అరకు లోయ టౌన్ షిప్ లో ఉత్సవ సందడి కనిపించకపోవడంతో స్థానికుల్లో కొంత అసంతృప్తి కలిగించినప్పటికీ, ఉత్సవ ప్రాంగణ మైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ ఊహించని విధంగా జన సందోహంతో నిండిపోయింది. ఈ ఉత్సవంలో హెలికాప్టర్ రైడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచినప్పటికీ అధిక రేట్లు వసూలు చేయడంతో అందరూ తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. పద్మాపురంలో నిర్వహించిన షో కూడా ఆశించినంతగా లేక వీక్షకులను నిరాశపరిచింది. చలి ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వీలుగా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎక్కడ కూడా ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ప్రధాన కూడలిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అరకు చలి ఉత్సవ్ సందర్భంగా ముగింపు రోజు ఆదివారం రాత్రి వివిధ సంస్కతిక కార్యక్రమాలు ఉత్తేజపరితంగా ముగిసింది.

ఉత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం సుంకరమెట్ట కాఫీ ప్లాంటేషన్ ఓపి అగర్వాల్ బృందం ట్రేకింగ్ నిర్వహించారు. అలాగే గిరిజన సంస్కతిక మ్యూజియంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా కలెక్టర్, అధికారులు తిలకించారు. అనంతరం సాయంత్రం యధావిధిగా వివిధ సంస్కతిక ప్రదర్శనలు నిర్వహించారు. శ్రీ విజయ భాస్కర్ తాల వైద్యం, పాశ్చాత్య గానం – నృత్యాలు, షాడో నృత్యం, జానపద పాటలు, ఆర్కెస్ట్రా, మైండ్ రీడింగ్ మెంటలిస్ట్ ప్రదర్శన, లేజర్ షో వంటి వినోద కార్యక్రమాలు అందరిని కనువిందు చేశాయి. చలి ఉత్సవ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐఏఎస్ అధికారులు బహుమతులు, మెమెంటోలు ప్రధానం చేశారు.



కుటుంబ సమేతంగా హాజరైన కలెక్టర్, జెసి

ట్రెక్కింగ్‌తో జోష్

పర్యాటకులలో ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని ధైర్యాన్ని నింపటానికి ఏర్పాటుచేసిన ట్రక్కింగ్‌లో పలువురు యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం ఉదయం సుంకర మెట్ట కాఫీ ట్రయల్ నుండి సుమారు మూడు కిలోమీటర్లు ట్రక్కింగ్ చేసి పర్యాటకులలో ధైర్యాన్ని నింపారు. ట్రెక్కింగ్ కు మధ్యప్రదేశ్‌కు చెందిన ఓపి అగర్వాల్ బృందం సపోర్ట్ చేసింది. విశాఖపట్నం జిల్లా జడ్జి ఎం గిరిధర్, డివిజనల్ ఫారెస్ట్ అధికారి సందీప్ రెడ్డి, సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం క్యూరేటర్ పి శంకర్రావు, తదితరుల ఆధ్వర్యంలో ట్రెక్కింగ్ సజావుగా సాగింది. ట్రక్కింగ్‌లో పాల్గొన్నవారు రకరకాల పక్షుల కూతలు, పలురకాల మొక్కల సువాసనలు, స్వచ్ఛమైన గాలి, వివిధ రకాల మెడిసినల్ ప్లాంట్స్ ఫీల్ పొందామని, ప్రకృతి ఒడిలో మై మర్చిపోయామని ఎంతో పరవశం తో చెప్పారు.

ప్రత్యేక ఆకర్షణగా ముగ్గుల పోటీలు

అరకు చలి ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. పాలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు ఎంతో ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. పలువురు మహిళ అధికారులు కూడా ఈ ముగ్గుల పోటీలలో పాల్గొని అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ పోటీలలో మొదటి బహుమతి బి.దేవి, రెండవ బహుమతి ఎల్.మధు శ్రీ, మూడవ బహుమతి యు.సునీత సాధించగా మూడేళ్ల చిన్నారి చిన్మయి పోటీలు పాల్గొని అందర్నీ ఆకర్షించడంతో ఆమెకు కన్సోలేషన్ బహుమతిని అందజేశారు. విజేతలకు బహుమతులు అందజేసిన జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించిందని, స్థానికులే కాకుండా పర్యాటకులు కూడా ముగ్గుల పోటీల్లో పాల్గొనడం గొప్ప విషయమని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎఎస్ఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి విభిషేక్, డిఆర్ఓ పద్మలత పాల్గొన్నారు.



మోకాళ్లపై నినాదాలు చేస్తున్న నాయకులు

అయ్యన్న వ్యాఖ్యలను నిరసిస్తూ

మోకాళ్లపై ఆందోళన

ప్రజాశక్తి - చింతపల్లి: అభివృద్ధి ముసుగులో రాజ్యాంగం కల్పించిన గిరిజన చట్టాలను నిర్వీర్యం చేసి హక్కులను కాలరాయాలని చూడడం పాలకులకు తగదని చౌడుపల్లి సర్పంచ్ గేమ్మెల లలిత, పంచాయతీ వార్డు సభ్యుడు కోరాబు కరుణానిధి తెలిపారు. 1/70 చట్టంపై శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆ పంచాయతీ పిసా ఉపాధ్యక్షులు ఎల్ రాజారావు, వి.దాసు, వైకాపా సీనియర్ నాయకులు సాగిన గంగన్నపడాల్, జి సింహాచలం, అరడ గంగన్నదొర, ఆ పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం మోకాళ్ళపై నిలుచుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేకంగా 1/70 చట్టం చేసి గిరిజనులకు పలు ప్రత్యేక హక్కులు కల్పిస్తే వాటిని సంరక్షించ వలసిన పాలకులు అందుకు భిన్నంగా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. చట్టాలను సంరక్షించే అత్యున్నత స్థానంలో ఉన్న శాసన సభాపతి గిరిజనుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయడాన్ని వారు తప్పు పట్టారు. మన్య ప్రాంతం అభివృద్ధి చెందాలంటే చట్టాలను తొలగించవలసిన, నిర్వీర్యం చేయవలసిన అవసరం లేదని తెలిపారు. అభివృద్ధి పేరుతో తమకు రాజ్యాంగం కల్పించిన చట్టాలను నిర్వీర్యం చేసి తమ హక్కులను కాలరాయాలని చూస్తే గిరిజనుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ వైస్ చైర్మన్ రాజేష్, వార్డు సభ్యులు, రమణమ్మ, ధనుష్, పీసా కమిటీ కార్యదర్శి జి అప్పారావు, ఆ పార్టీ శ్రేణులు జి.కగుపతి, కే బాబురావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జీడి మామిడి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: కొద్ది రోజులుగా పొగ మంచు అధికంగా కురుస్తోంది. దీంతో తెల్లవారుజాము నాలుగు గంటల నుండి ఉదయం 10 గంటల వరకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక లైట్లు వేసుకొని బిక్కుబిక్కుమంటూ వాహనాలను నడుపుతున్నారు. మరో వైపు పొగ మంచువల్ల జీడి, మామిడి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలో వడ్డాది, బంగారు మెట్ట, లోపుడి, పొట్టి దొరపాలెం, కొన్నంపూడి, కేపీ అగ్రహారం, గున్నెంపూడి, దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం, మల్లం, పెదపూడి తదితర గ్రామాల్లో మెట్ట భూముల్లో రైతులు జీడి మామిడి సాగును అధికంగా చేస్తున్నారు. ప్రస్తుతం జీడి మామిడి చెట్లు పూత దశలో ఉన్నాయి. గత వారం రోజులుగా తెల్లవారుజాము నుండి పొగ మంచు కురుస్తుండడంతో పూత మాడిపోతుంది. రైతులు జీడి మామిడి తోటలో దుక్కులు దున్నించి చెట్ల మొదల్ల వద్ద పాదులు తవ్వించే ఎరువులు వేసి లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. పూత మాడిపోవడంతో దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు.



మంచుతో మాడి పోతున్న పూత



రగ్గులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పిల్లలకు రగ్గులు, బకెట్ల పంపిణీ

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని మఠం పంచాయతీలో వర్షిన్ మీడియా లిమిటెడ్ బృందం చెండా అయ్యప్ప ఆధ్వర్యంలో హుకుంపేట మండలం మఠం వనవాసి కళ్యాణ ఆశ్రమంలో 75 మంది అనాధ పిల్లలకు రగ్గులు, స్నానాలకు బకెట్స్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వర్షిన్ మీడియా లిమిటెడ్ ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ, సామాజిక సేవలో భాగంగానే 75 మంది అనాధ పిల్లలకు బృందం సభ్యుల తరుపున ఇవ్వామన్నారు.గతంలో పాడేరు మండల కేంద్రంలో అనాధ ఆశ్రమంలో పిల్లలకు, హుకుంపేట మండలం సన్యాసమ్మ పాలెం గ్రామంలో వృద్ధులకు రగ్గులు పంపిణీ కూడా చేశామన్నారు.సంస్థ చేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో వర్షిన్ మీడియా లిమిటెడ్ బృంద సభ్యులు ప్రసాద్, ఈశ్వరావు, అప్పలరాజు, దాలయ్య, వనవాసి కళ్యాణ ఆశ్రమం నిర్వాహకులు అప్పయమ్మ, నిక్కుల సాయి ప్రసాద్, సిద్దేశ్వరరావు, కిల్లో.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం స్థానంలో...

మనుధర్మం ప్రవేశపెట్టే కుట్ర

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ భారత రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని ప్రవేశ పెట్టేందుకు కేంద్రంలోని బిజెపి పాలకులు ప్రయత్నిస్తున్నారని, అత్యంత ప్రమాదకరమైన ఈ చర్యను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఏకలవ్య కాలనీలో నెల్లిమర్ల అమరవీరుల 31వ స్మారక సభ నిర్వహించారు. ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా పాలకవర్గాలు అనేక మోసపూరిత విధానాలను అమలు చేస్తూ కార్మిక, ప్రజల హక్కులను కాలరాస్తూ వచ్చాయన్నారు. దశాబ్ద కాలంగా ఆర్ఎస్ఎస్, బిజెపి నేతృత్వంలో మౌళికంగానే విధానాలను మార్చే పనికి పూనుకున్నారని విమర్శించారు. ఆ క్రమంలోనే 4 లేబర్ కోడ్‌లను, 3 నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చారన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆస్తులను కార్పొరేట్ వ్యక్తులకు కారు చౌకగా కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అటవీ ప్రాంతాలను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చట్టాలను మారుస్తున్నారన్నారు. ప్రశ్నిస్తున్న ఆదివాసీలపైనా, వారికి అండగా నిలబడిన విప్లవ సంస్థలు, మేధావులపైనా ఆపరేషన్ కగార్ పేరుతో ఏకపక్ష యుద్ధం చేస్తున్నారని ఆరోపించారు. విద్యా వ్యవస్థను కాషాయీకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేసి బడుగు బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే కుట్రకు పూనుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు సీనియర్ నాయకులు వై.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటలో అమర్‌నాథ్, ధర్మశ్రీ పర్యటన

ప్రజాశక్తి-కొత్తకోట:చోడవరం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయ కర్త కరణం ధర్మశ్రీ రావికమతం మండలం కొత్తకోట లో ఆదివారం పర్యటించారు. సమన్వయ కర్తలు గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మండలానికి రావడం తో స్థానిక వైసీపీశ్రేణి మండల నాయ కులు ఘనస్వాగతం పలికారు.స్థానిక షిరిడి సాయి బాబా ఆలయం లో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు పెనుగొండ నానాజీ తదితరులు అమర్నాథ్ తో పాటు ధర్మశ్రీ లను సత్కరించారు. అనంతరం స్థానిక వాణిజ్య వేత్త పెనుగొండ సన్యాసిశెట్టి ఇంటిలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైల రాజు, ముక్కా మండల పార్టీ అధ్యక్షులు ముక్కా మహాలక్ష్మి నాయుడు, డిసిసిబి మాజీ డైరెక్టర్ గుమ్మడి సత్య దేవ్, కె.జగ్గారావు, గ్రామ సర్పంచ్ కె.లోవరాజు, ఉప సర్పంచ్ పి దేవ పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థుల కోసం...

జోలాపుట్ రిజర్వాయర్‌లో గాలింపు



గాలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : ఏఓబి సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు రిజర్వాయర్లో శనివారం సుమారు సాయంత్రం 4:30 సమయంలో ముగ్గురు బోటు షికారుకు వెళ్లారు. నాటు పడవ మునిగి ఇద్దరు గల్లంతవ్వగా ఒకరు అతి కష్ట తరంగా ఈదుకుంటూ ఒడ్డున చేరుకున్నారు. వివరాల్లోకి వెళితే.....ఒరిస్సా రాష్ట్రం జోలాపుట్టు గ్రామానికి చెందిన అమిత్ కుమార్ హంతాల (15) శివ హంతాల (15), గౌతమ్ కుమార్ కిముడు (15) అను ముగ్గురు స్నేహితులు. ఒరిస్సా గవర్నమెంట్ హైస్కూల్ లో విద్యనభ్యసిస్తున్నారు. జోలాపుట్టు రిజర్వాయర్‌లో నాటు పడవ మీద బోటు షికారుకు వెళ్లారు. రిజర్వాయర్ మధ్యలో వెళ్లగా నాటు పడవలో నీరు చేరి మునిగింది.దీంతో ఇద్దరు గల్లంతయ్యారు. ఒకరు అతి కష్టంతో రిజర్వాయర్ ఒడ్డున చేరారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. శనివారం రాత్రి 7 గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం ముంచింగిపుట్టు మండలం తహసీల్దార్, సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఒరిస్సా తహసీల్దార్, ఆలీ, పోలీస్ సిబ్బంది, ఆంధ్ర రెవెన్యూ శాఖ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన ఆర్థో వైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సు

ఎపి ఆర్థో సర్జన్ల సొసైటీ అధ్యక్షునిగా అశోక్‌కుమార్



రాష్ట్ర స్థాయి సదస్సు ముగింపులో పాల్గొన్న ఆర్థో వైద్య నిపుణులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్, ఆంధ్ర మెడికల్ కళాశాల, కింగ్ జార్జ్ ఆసుపత్రి ఆర్థో విభాగం సంయుక్త ఆధ్వర్యాన ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పి.శివానంద పర్యవేక్షణలో ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు (ఒసాప్కాన్-2025) ఆదివారం నాలుగో రోజు ఘనంగా నిర్వహించారు. నగరంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఏరీనాలో జరిగిన ముగింపు కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్థోవైద్యులు డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ, కీళ్ల మార్పిడి, వాటి అరుగుదల, అందుబాటులో ఉన్న నూతన వైద్య విధానాలు, శస్త్ర చికిత్సలపై గ్రామ స్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కీళ్ల మార్పిడికి సంబంధించి ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే తగిన ఇబ్బందులు లేకుండా జీవనం సాగిచవచ్చన్నారు. ప్రముఖ ఆర్థో డాక్టర్ కృష్ణకిరణ్ మాట్లాడుతూ, జాయింట్ రీప్లేస్మెంట్, హిప్ రీప్లేస్మెంట్ విభాగాలపై కూడా వైద్యులు, వైద్య విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు.

నాలుగు రోజులు పాటు జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆరు లైవ్ సర్జరీలు, ఐదు వర్క్ షాపులు నిర్వహించగా 150 మంది వైద్య నిపుణులు, వెయ్యి మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు ముగింపు సందర్భంగా ఆర్గనైజింగ్ చైర్మన్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద సదస్సు సందేశం ఇచ్చారు.

అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆర్థోపెడిక్ సర్జన్ సొసైటీ నూతన అధ్యక్షునిగా సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఇప్పటివరకు డాక్టర్ సునంద్ కుమార్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షునిగా వ్యవహరించారు. వచ్చే ఏడాది ఈ రాష్ట్ర స్థాయి సదస్సు కర్నూలులో నిర్వహిచాలని నిర్ణయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎల్ఎస్.లోకనాధ్, డాక్టర్ వర్మ, ప్రముఖ ఆర్థో వైద్యులు వివికె, రమేష్ సేన్, విజయ్, అశోక్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని డ్రైవింగ్ పైనే పూర్తి శ్రద్ధ ఉంచాలని , దృష్టి మరల్చి తే ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. కారు, ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు చిన్న పొరపాటు ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను తీసుకుంటుందని గుర్తించు కోవాలని సూచించారు.ఓవర్ టేక్ చేస్తున్న కొన్ని పరిస్థితులలో ఏమైనా యాక్సిడెంట్లు అయితే హాస్పటల్లో కొన్ని గంటల నుంచి సంవత్సరాలు కూడా కోలుకోలేని పరిస్థితిలో ఉంటున్నారని వివరించారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ హెల్మెట్ వాడుతూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని కోరారు. అతివేగం ప్రమాదకరమని నిదానమే ప్రధానమని తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలో శొంఠ్యాం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి. అనకాపల్లి గాంధీనగర్‌కు చెందిన బయ్యవరపు. నూతన్ కుమార్(23) మధురవాడలో లివింగ్‌స్టోన్ షోరూంలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అనకాపల్లి నుండి మధురవాడ బైక్‌పై వస్తుండగా శొంఠ్యాం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఘటనాస్థలిలోనే మృత్యువాత పడ్డాడు. అవివాహితుడైన మృతునికి తల్లిదండ్రులు లోకేశ్వరి, శంకరరావు, సోదరి దీప్తి ఉన్నారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రంగురాళ్ల క్వారీలో గస్తీ

ప్రజాశక్తి-గొలుగొండ:అంతర్జాతీయ మార్కెట్లో అత్యంత విలువైన రంగురాళ్లు లభ్యమయ్యే కరక రంగురాళ్ల క్వారీ చుట్టు గస్తీ ముమ్మరం చేశామని గొలుగొండ ఎస్సై రామారావు తెలిపారు. ఈ మేరకు కరక రంగురాళ్ల క్వారీ సమీపంలో శనివారం రాత్రి తన సిబ్బందితో గస్తీ తిరిగామన్నారు. అంతేకాకుండా ప్రతీ రోజు ఇద్దరు కానిస్టేబుళ్లను బీట్‌గా ఏర్పాటు చేసి రాత్రుళ్లు కూడా ఇక్కడ గస్తీ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కరక క్వారీ సమీపంలో అనుమానస్పదంగా తిరిగినా, తవ్వకాలకు పాల్పడినా, ప్రయత్నించినా, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి- నాతవరం:మండలంలోని తాండవ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వసంత పంచమిని పురస్కరించుకొని తాండవలో జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల నుంచి గ్రామస్తులు తరలివచ్చారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల తీర్థం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కే.నాయుడుపాలెంలో ఆదివారం గౌరీపరమేశ్వరుల తీర్థ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ కనబర్చారు. అనంతరం విజేతలకు సీఎంఆర్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. అనంతరం వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్ములూరు సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విల్లూరి డాక్టర్ చక్రవర్తికి అభినందనలు


ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మధురవాడ పరదేశిపాలెం డాక్టర్ సదాశివరావు లే-అవుట్‌కు అప్రూవల్ ప్లాన్ మంజూరుకు విశేష కృషి చేసిన విల్లూరి డాక్టర్ చక్రవర్తి, తిరుమల దేవి దంపతులను అసోసియేషన్ సభ్యులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ శర్మ, పి.గుప్తా మాట్లాడుతూ, తాము లే-అవుట్ అనుమతి కోసం అనేక ప్రయత్నాలు చేసినా పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ పరిస్థితులలో సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి విల్లూరి చక్రవర్తి తీసుకెళ్లడంతో, సిఎం ఫేషీ ఒఎస్‌డి ద్వారా విశాఖ కలెక్టర్‌కు నివేదిక రావడంతో వెంటనే పరిష్కరించారని తెలిపారు. విల్లూరి దంపతుల కషిని కొనియాడారు.



విల్లూరి డాక్టర్ చక్రవర్తి, తిరుమల దేవి దంపతులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఘాట్ రోడ్డు మలుపుల్లో తుప్పలు

దారి కానరాక వాహనదారుల అగచాట్లు



ఇరువైపులా తుప్పలు కమ్ముకోవడంతో ప్రమాదభరితంగా ఘాట్‌రోడ్డు మలుపులు

ప్రజాశక్తి-సీలేరు: జీకే.వీధి మండలం సప్పర్ల - దారాలమ్మ ఘాట్ రోడ్‌లో తుప్పలు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనచోధకులు భయాభ్రాంతులకు గురవుతున్నారు. జీకే వీధి నుంచి ధారాలమ్మ ఘాట్ రోడ్డు వరకు రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు, తుప్పలు దట్టంగా పెరిగిపోయాయి. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇరుకైన రహదారి కావడంతో పాటు ఈ రోడ్డు గొయ్యిలుగా మారడంతో ప్రమాద భరితంగా ఉంది. ప్రధానంగా రాత్రి సమయంలో వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనచోధకులు ఆందోళన చెందుతున్నారు. ఒకపక్క తీవ్రంగా మంచు కురవడం, మరోపక్క దట్టంగా రహదారి కిరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ప్రయాణ సౌకర్యానికి విఘూతాం కలుగుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది టెండర్ ప్రాతిపదికిన రహదారికి ఇరువైపులా తుప్పలు తొలగించే చర్యలు ఆర్ అండ్ బి అధికారులు చేపట్టేవారు. అయితే కొన్నాళ్లగా తుప్పలు తొలగించడం లేదు సరికదా, రహదారిపై ప్రమాదవశాత్తు చెట్లు, బండ రాళ్లు పడినా తొలగించేందుకు అధికారులు సకాలంలో స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా తుప్పలు తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ఘనంగా కళావేదిక వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలోని ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'కళావేదిక' 30వ వార్షికోత్సవాన్ని ఆదివారం విశాలాక్షినగర్ బివికె.కాలేజీ కళామందిరంలో .కళావేదిక గౌరవాధ్యక్షుడు కమల్ బైడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎయు పూర్వ ఉప కులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు, లెండి కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె.శివరామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా.కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నండూరి రామకృష్ణ మాట్లాడుతూ ముప్పై ఏళ్లుగా అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించి,పలువురు కళాకారులకు అండగా నిలిచామన్నారు. వార్షికోత్సవంలో జర్నలిస్టులను, 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్న క్రీడాకారులను, కోచ్‌లను సత్కరించారు. జర్నలిస్టులు కెవి.శర్మ, చిన్నికృష్ణ, నాగరాజు పట్నాయక్, ఎల్లేశ్వర రావు, సిహెచ్‌విఎస్.రామకృష్ణ, జగన్మోహన్, పైలా దివాకర్, వెంపటి రాజు, వెంకట్, ఆర్.రాజేష్, ఎన్ రమేష్‌లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు..కళావేదిక సెక్రెటరీ డాక్టర్ బి.రజని వ్యాఖ్యాతగా వ్యవహరించగా, సంయుక్త కార్యదర్శి పిఆర్ఎన్ వెంకట ప్రభు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

1452వ రోజుకు ఉక్కు దీక్షలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిసామర్థ్యంతో నడిపేందుకు కేంద్రం ఇచ్చిన ప్యాకేజీని వినియోగించాలని స్టీల్ ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం ఆర్చి వద్ద రిలేదీక్షలు ఆదివారం 1452వ రోజున ఇంటక్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, సెయిల్ విలీనం చేయాలని,టాక్స్ హాలిడే ప్రకటించాలని కోరారు. వేతనాలను చెల్లించి కార్మికులను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కోరారు

ఊట గెడ్డ నీరే గతి..



ఊటగెడ్డల్లో కలుషిత నీటిని సేకరిస్తున్న గిరిజన మహిళలు

- బురద నీరు తాగుతున్న చంద్రుపల్లి, లైకాన్‌పూర్ గ్రామస్తులు
- రోడ్డు లేక ఏర్పాటు కాని బోరుబావులు
- జల్ జీవన్ మిషన్ నిధులు మంజూరైనా అధికారుల నిర్లక్ష్యంతో వెనక్కి

ప్రజాశక్తి -సీలేరు : మారుమూల గిరిజన గ్రామాల్లో మంచినీటి సౌకర్యం లేక ఊట గెడ్డల నుండి వచ్చే బురద నీటినే తాగాల్సి వస్తోంది. దీంతో గిరిజనులు అనేక రోగాల బారిన పడుతున్నారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా మంజూరైన నిధులు కూడా అధికారుల నిర్లక్ష్యం కారణంగా వినియోగించకపోవడంతో అవి వెనక్కి వెళ్లిపోయిన దుస్థితి నెలకొంది.

జీకే.వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధి చంద్రుపల్లి, లైకాన్‌పూర్ గ్రామాలకు కొన్ని సంవత్సరాలుగా మంచినీటి సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాధుడే లేరు. ఆయా గ్రామాలకు రహదారి లేక బోరు బావి తవ్వించడానికి వాహనాలు వెళ్లే పరిస్థితి లేదని అధికారులు షాకులు చెప్పుకుంటూ వచ్చారు. గత వైసిపి ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఆయా గ్రామాలకు బోరు బావులు మంజూరు చేసింది. రహదారి సౌకర్యం లేక బోరు బావి తవ్వే వాహనాలు వెళ్లలేదని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సీలేరు సర్పంచ్ దుర్గో దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచ్ చొరవ తీసుకొని వెంటనే పంచాయతీ నిధులతో ఆయా గ్రామాలకు మట్టి రోడ్డు నిర్మించారు. మట్టి రోడ్డు నిర్మించిన తర్వాత తమ గ్రామాలకు బోరుబావులు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను సర్పంచ్ కోరగా జల్ జీవన్ పథకంలో మంజూరైన వర్కులు రద్దయినట్లు చెప్పారు. దీంతో సర్పంచ్ నిర్ఘాంతపోయారు.



దూరం నుంచి నీరు తెస్తున్న గిరి మహిళ

జీకే వీధి మండల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నిర్లక్ష్యం వల్లే జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన బోరు బావుల పనులు రద్దయినట్లు స్థానికులు సీసా దన్ను, సీసా బుద్ధు, కిలో పోదం, సీతా రాము మండిపడ్డారు. గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించకుండా అధికారుల నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలకు సాగునీటిగా, కాలకృత్యాలకు ఉపయోగించే కొండలపై నుంచి వచ్చే ఊటనీటినే సేకరించి తాగునీటిగా ఉపయోగించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీరు తాగడం వలన రోగాల బారిన పడక తప్పడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామాలకు మంచినీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

పోర్టు ఆసుపత్రి టెండర్లకొస్తే తరిమికొడదాం

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రిలేదీక్షలు ఆదివారం 125వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఆలిండియా వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిడి నందకుమార్, టి.నరేంద్రరావు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని ఐక్య పోరాటాలు ద్వారా అడ్డుకుని, తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్యానికి సరైన కేటాయింపులు చేయని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, పోర్టు భూములను అద్దెకిచ్చి, ఆస్తులను ప్రయివేటుపరంగా చేయాలని చూస్తోందని, అందులో భాగంగా ఆధునికీకరణ పేరుతో విశాఖ పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ అన్నారు. పోరాటాలతో టెండర్‌ను అడ్డుకున్న విధంగానే, పోర్టు ప్రయివేటు పరం కాకుండా ఉద్యమిద్దామని, దీనికి ఆలిండియా కోఆర్డినేషన్ కమిటీలోని ఆరు ఫెడరేషన్లు పూర్తి మద్దతుస్తున్నాయన్నారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని పోర్టులో కార్మికుల ఒక రోజు నిరసన తెలియజేస్తామన్నారు.

సి డి నందకుమార్ మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్‌ఫండ్స్, విలువైన వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రైవేటీకరణ నిర్ణయం అన్యాయమని, దీన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి కార్యదర్శి మసేన్ అధ్యక్షతన దీక్షల్లో ఐఎన్‌టియుసి, హెచ్ఎంఎస్, జాతీయ నాయకులు, సిఐటియు నాయకులు కె. సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, శంకరరావు, కెఎస్ కుమార్, రాఘవులు, విజయకుమార్ నాయుడు పాల్గొన్నారు.



దీక్షల్లో మాట్లాడుతున్న నరేంద్రకుమార్

కడుపుబ్బ నవ్వించిన 'వినోదాల విందు'



స్కిట్ ప్రదర్శిస్తున్న ఎంవి.సుబ్రహ్మణ్యం, అడవిరాజు తదతరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ 'వినోదాల విందు'లో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. సంస్థ అధ్యక్షులు ఎంవి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో హరిహర నృత్యనికేతన్ డాన్స్ స్కూల్ గురువు అల్లు వెంకటరమణ శిష్యులు అనూష, అనన్య. సాంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. అనంతరం వడ్డాణం, సెల్‌ఫోన్, నూడిల్స్, పెదవి చిట్లింది. తాగుబోతు, కోర్టు సీన్, దొందుకు దొందే డాక్టర్ పేషెంట్, లవర్ మీద కేసు, ప్రూఫ్, 4సిమ్స్, రివర్స్ పంచ్, మ్యూజిక్ డైరెక్టర్, డైమండ్ నెక్లెస్, ముందుజాగ్రత్త, అబ్బాయికి మాటలొచ్చాయి, 108 వంటి లఘునాటికలు, స్కిట్స్ అలరించాయి. జబర్దస్త్ ప్రకాష్. ఎంవి సుబ్రహ్మణ్యం. వెంకటేశ్వరరావు. పోర్ట్ శేషు, భానుప్రకాష్, శివ జ్యోతి,. పుష్యమి. ఈశ్వరరావు, సీత తమ నటనతో నవ్వులు పూయించారు. అనంతరం కళాకారులను తిలక్ పట్నాయక్, ఆడిటర్.సన్ మూర్తి, స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ మాల్యాద్రి మెమొంటోలతో సత్కరించారు.

పాలిటెక్నిక్ కోర్సుతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ మురళీకృష్ణ

ప్రజాశక్తి తగరపువలస : పాలిటెక్నిక్ కోర్సు చదవడం ద్వారా తొందరగా ఉద్యోగం పొందవచ్చని భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక అవంతి ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలో 'ప్రగ్యాన్ 2కె25' పేరిట ఆదివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఉన్నట్లు వివరించారు. పైడి భీమవరం, ఏపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ హెడ్ అండ్ అడ్మిన్ కె కమలాకరరెడ్డి మాట్లాడుతూ, ఫార్మసీ రంగంలో మెండుగా ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందింపుచ్చుకోవాలన్నారు. జీవితంలో స్థిరపడేందుకు విద్యార్థి దశలోనే ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

పాలిసెట్ నమూనా పరీక్ష

కళాశాలలో పాలిసెట్ నమూనా పరీక్షను నిర్వహించారు. విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు.అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ 10 వేలు, రెండో బహుమతిగా రూ 7 వేలు, మూడో బహుమతి గా రూ 3,500లతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. సాంకేతిక ఉత్సవంలో ఓపెన్ హౌస్, పాలిటెక్నిక్ విద్యార్థులు తయారు చేసిన 50 సాంకేతిక నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అవంతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జగదీష్, శేషు పాల్గొన్నారు.